

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శనివారం 31-10-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :133 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

గూఢచర్యం గుట్టురట్టు.. ఇద్దరు పట్టుబాటు!



ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ మెరుపు దాడి

సరిహద్దు దాటిన దేశద్రోహ కుట్ర

ఓటీపీలతో పాక్ ఏజెంట్లకు వల

వాట్సాప్ ఖాతాలతో రహస్య ఆపరేషన్

హవాలా డబ్బుతో దేశ భద్రతకు తూట్లు

వైజాగ్ నేవల్ బేస్‌పై పాక్ నిఘా

2 లో

ఫుడ్ కంపెనీలపై మెరుపు దాడులు!

ఫుడ్ యూనిట్లపై అధికారుల మెరుపు దాడులు

20 తయారీ కేంద్రాల్లో ఏకకాలంలో తనిఖీలు

అపరిశుభ్రత.. నిబంధనల ఉల్లంఘనలు

పురుగులు, ఎలుకల మధ్య ఆహార తయారీ

తొమ్మిది సంస్థల లైసెన్సులు సస్పెండ్

రూ.5.89 లక్షల ఆహార పదార్థాలు సీజ్

కల్తీ అనుమానంతో 21 నమూనాల సేకరణ

మరో తొమ్మిది సంస్థలకు షోకాజ్ నోటీసులు

న్యూస్ డెస్క్, 30 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణలో ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న ఆహార తయారీ యూనిట్లపై తెలంగాణ ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ కఠిన చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు హైదరాబాద్, వరంగల్, ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లోని సుమారు 20 ఆహార తయారీ కేంద్రాల్లో ఏకకాలంలో ఆకస్మిక మెరుపు దాడులు నిర్వహించాయి.



2 లో

కాంగ్రెస్ ర్యాలీ వాయిదా వేయండి!

కాంగ్రెస్ ర్యాలీ వాయిదా వేయాలని వ్యాపారుల విజ్ఞప్తి

సోనియా గాంధీకి ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ లేఖ

రూ.12 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం 2 లో

దీపావళి షాపింగ్‌కు ఆటంకం కలిగే అవకాశం

20 కీలక మార్కెట్లకు నష్టం తప్పదని ఆందోళన

నవంబర్ 11 తర్వాత ర్యాలీ నిర్వహించాలని సూచన

బురారీ గ్రౌండ్‌కు మార్చాలని ప్రత్యామ్నాయం

పార్కింగ్ సదుపాయాలపై వ్యాపారుల అభ్యంతరం

స్థానిక ఎన్నికలపై జగన్ అలర్ట్!

నామినేషన్ల దశలోనే దౌర్జన్యాలు

బీ-ఫారాల మాయం.. ఫోర్జరీ సంతకాలు

రిగ్గింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిక

అక్రమాలను వీడియోల్లో రికార్డు చేయాలి

ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

ఆధారాలతో కోర్టును ఆశ్రయించాలని ఆదేశం


2 లో

న్యూస్ డెస్క్, 30 అక్టోబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ నాయకులకు, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా నామినేషన్ల ఘట్టం నుంచే అక్రమాలు, దాడులు మొదలయ్యాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నామినేషన్ కేంద్రాలను ఆక్రమించడం, బి-ఫారాలను మాయం చేయడం, ఫోర్జరీ సంతకాలతో ఉపసంహరణలు చేయించడం, చివరికి రిటర్నింగ్ ఆఫీసర్లే నామినేషన్ పత్రాలను చింపేయడం వంటి దారుణాలు తొలిసారిగా చూస్తున్నామని విమర్శించారు. అధికారులను, పోలీసులను అడ్డుపెట్టుకుని చంద్రబాబు ప్రభుత్వం ఒక మాఫియా ముఠాలా వ్యవహరిస్తోందని, ప్రజల రాజ్యాంగ హక్కులను హరిస్తోందని ఆరోపించారు.

మాచవరంలో మళ్లీ గ్యాస్ లీకేజ్!

పంట పొలాల్లో ఎగసిపడిన గ్యాస్

స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు

ఘటనా స్థలానికి ఓఎన్జీసీ అధికారులు

లీకేజీని అదుపులోకి తీసుకొచ్చిన సిబ్బంది

ప్రస్తుతానికి ప్రమాదం లేదని వెల్లడి

శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

2 లో

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అండ!

2047 లక్ష్య సాధనకు సమష్టి కృషి

వేగంగా వృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ

కాకతీయుల కాలంలోనే నౌకా వాణిజ్యం

పారిశ్రామికవేత్తలకు విధాన స్థిరత్వం అవసరం

హైదరాబాద్‌లో కీలక రంగాల పురోగతి

స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు

ఎమ్మెల్సీ పోరుకు టీఆర్ఎస్ రెడీ!


2 లో



న్యూస్ డెస్క్, 30 అక్టోబర్ (ఇది కద నిజం): రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచే తమ పార్టీ అభ్యర్థులను తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరును ఖరారు చేశారు.



భూకబ్జాల గుట్టు సీఎం రట్టు!

- కేసీఆర్ భూదందాపై సీఎం ఫైర్!
- మియాపూర్ భూములపై సుప్రీం విజయం!
- 550 ఎకరాలు.. రూ.50 వేల కోట్ల భూమి!
- గత సర్కార్ అండతోనే అక్రమాలు!
- భూముల స్వాధీనానికి సీఎం ఆదేశాలు!
- మంచిరేవుల భూములూ కాపాడాం!
- యంగ్ ఇండియా స్కూల్‌కు 50 ఎకరాలు!
- ఎర్రవల్లి 388 ఎకరాలపై సర్వే!
- రూ.1.50 లక్షల కోట్ల భూములకు రక్షణ!

న్యూస్ డెస్క్, 30 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు తమ ప్రభుత్వం అత్యంత సమర్థవంతంగా పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతిపక్ష కేసీఆర్ వర్గంపై పలు తీవ్రమైన ఆరోపణలు చేశారు. మియాపూర్ భూముల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో అనుకూలంగా తీర్పు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. మియాపూర్‌లోని దాదాపు 550 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి తమ అనుచరులు, కొందరు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు గతంలో కేసీఆర్ ఆయన అనుచరగణం చూశారని ఆరోపించారు. ఈ భూముల విలువ దాదాపు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.

మిగతాది 2 లో..

మూసీ ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం కాదు!

న్యూస్ డెస్క్, 30 అక్టోబర్ (ఇది కద నిజం): మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుకు తాము ఎంతమాత్రం వ్యతిరేకం కాదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ అబద్ధాలను ప్రచారం చేస్తోందని, బీజేపీ ఈ ప్రాజెక్టును అడ్డుకుంటోందంటూ తప్పుడు ప్రచారం సాగిస్తోందని ఆయన మండిపడ్డారు.


2 లో

అర్నబ్ దెబ్బకు ఉత్తరాంధ్ర విలవిల!



ఉప్పొంగిన బాహుదా నది

పలు గ్రామాలు జలదిగ్బంధం

ఆంధ్రా-ఒడిశా మధ్య రాకపోకలు బంద్

జాతీయ రహదారిపై వరద నీరు

శ్రీకాకుళంలో భారీగా పంట నష్టం

2 లో

దేశ పురోగతి కొందరికి ఇష్టం లేదు!

గల్ఫ్ ఉద్రిక్తతలపై మోడీ వ్యాఖ్యలు

ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు

కొరతపై పుకార్లు వ్యాప్తి చేస్తున్నారని ఆరోపణ

అభివృద్ధి అడ్డుకోవడమే లక్ష్యమని వ్యాఖ్య

రైతులపై ధరల భారం పడకుండా చర్యలు

రైతులకు అండగా ఉంటామని హామీ

సాయిల్ హెల్త్ కార్డులతో ప్రయోజనాలు


2 లో

న్యూస్ డెస్క్, 30 అక్టోబర్ (ఇది కద నిజం): ఇరాన్ యుద్ధం, గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో గ్యాస్, ఎరువుల కొరత ఏర్పడుతుందంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆరోపించారు. దేశం కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వానికి అండగా నిలవాల్సింది పోయి, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని విమర్శించారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 31-10-2026

మూసీ ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం కాదు!

మొదటి పేజీ తరువాయి

పేదలను నిర్వాసితులను చేయొద్దు..

తాము మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును తప్పుబట్టడం లేదని రాంచందర్ రావు అన్నారు. కానీ 'గాంధీ సరోవర్' పేరుతో మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేద ప్రజలను నిర్వాసితులను చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా మూసీని ప్రక్షాళన చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, పింఛన్లు ఇచ్చేందుకు, పీఆర్సీ అమలు చేయడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం.. మూసీ ప్రక్షాళన పేరుతో రూ.వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధపడటం విడ్డూరంగా ఉందన్నారు. పథకాలకు లేని డబ్బులు ఈ ప్రాజెక్టుకు ఎక్కడి నుంచి వస్తున్నాయని రాంచందర్ రావు ప్రశ్నించారు.

మాక్ పార్లమెంట్‌పై తీవ్ర ఆగ్రహం..

ఢిల్లీలో ప్రతిపక్షాలు నిర్వహించ తలపెట్టిన 'మాక్ పార్లమెంట్' పై రామ్‌చందర్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ములాయం సింగ్ యాదవ్ నేతృత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే.. అసలు దీనిని ఎందుకు నిర్వహిస్తున్నారంటూ నిలదీసిన వ్యక్తి సోనియా గాంధీ కాదా అని ప్రశ్నించారు. పార్లమెంట్ అంటే ప్రజాస్వామ్య దేవాలయమని గతంలో కాంగ్రెస్ నాయకురాలు, మాజీ స్పీకర్ మీరా కుమార్ చెప్పారని గుర్తు చేశారు. కానీ నేడు అదే కాంగ్రెస్ నేతలు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మాక్ పార్లమెంట్లు పెట్టి పార్లమెంటరీ వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని చులకన చేస్తున్నారని రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఎమ్మెల్సీ పోరుకు టీఆర్ఎస్ రెడీ!

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే వరంగల్ - ఖమ్మం - నల్గొండ గ్రాడ్యుయేట్ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన కవిత.. ఇప్పుడు రెండో స్థానంలోనూ బీసీ సామాజికవర్గానికి చెందిన ఆకాశ్ కొల్లూరుకు అవకాశం ఇచ్చి తన మార్కు రాజకీయ ప్రాధాన్యతను చాటుకున్నారు.

జర్నలిజంలో 20 ఏళ్ల ప్రస్థానం..

హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన ఆకాశ్ కొల్లూరు స్వచ్ఛమైన హైదరాబాద్ వాసి. ఆయన జాతీయ మీడియా రంగంలో 20 ఏళ్లుగా సీనియర్ జర్నలిస్టుగా సేవలందిస్తున్నారు. ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి ప్రముఖ జాతీయ మీడియా సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆకాశ్ కొల్లూరు బేగంపేటలోని ప్రసిద్ధ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో పాఠశాల విద్యను పూర్తి చేశారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి బంగారు పతకం సాధించారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో గ్రాడ్యుయేట్ ఓటర్ల మద్దతు ఆయనకే లభిస్తుందని పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది.

ఎన్నికల అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘు..

ఇక హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి అబ్జర్వర్, కో-ఆర్డినేటర్‌గా పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ చిట్నేని రఘును నియమించారు. అలాగే, రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇంచార్జ్ ప్రముఖ న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాకు బాధ్యతలు అప్పగించారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఇంచార్జ్‌లు వీరే..

హైదరాబాద్: సురభి, మతీన్, బండారి మహేందర్ ముదిరాజ్
రంగారెడ్డి: అర్చనా సేనాపతి
మహబూబ్ నగర్: రంజిత్ గొంగళ్ల
నల్గొండ: సుజిత్
ఖమ్మం: గట్టు కరుణ
వరంగల్: మాడుగుల రాజిరెడ్డి.

అర్నబ్ దెబ్బకు ఉత్తరాంధ్ర విలవిల!

న్యూస్ డెస్క్, 30 అక్టోబర్ (ఇది కద నిజం): అర్నబ్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఉత్తరాంధ్ర వణికిపోతోంది. నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పదుల సంఖ్యలో గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా, రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా ఒడిశా పరిధిలో కురిసిన వర్షాలకు వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్రతనయ, సువర్ణముఖి, వేగావతి నదులు తీవ్రంగా ఉప్పొంగాయి. బాహుదా నదికి ఏకంగా 86,458 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. వంశధార గొట్టాబ్యారేజీ వద్ద 73,324 క్యూసెక్కుల నీరు నమోదు కావడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

ముంపునకు గురైన గ్రామాలు..

నదులు ఒప్పొంగడంతో ఏపీలోని శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస, మందస, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలు గ్రామాలు, పార్వతీపురం మన్యం జిల్లాలోని నూకలవాడ, వంతరాంలతో పాటు విజయనగరం జిల్లా వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లోని అనేక గ్రామాలు నీటమునిగాయి. ఇచ్ఛాపురం లొద్దపుట్టి వద్ద చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపైకి వరద చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇచ్ఛాపురం-జాడిపూడి మధ్య రైల్వే ట్రాక్, వంతెనను ఆనుకుని వరద ప్రవహించడంతో రైళ్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. అదేవిధంగా అరకు-విశాఖపట్నం ఘాట్‌రోడ్‌లో గాలికొండ వద్ద రహదారి జారిపోవడంతో రోడ్డు మూసివేశారు. బొర్రా-కరకవలస స్టేషన్ల మధ్య రైలు ట్రాక్ దెబ్బతినడంతో కొత్తవలస-కిరండూల్ పాసింజర్‌ను నవంబర్ 3 వరకు రద్దు చేశారు.

భారీగా పంట నష్టం..

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 728 గ్రామాల్లో సుమారు 21,590.64 హెక్టార్లలో వరిపంట, 383.80 హెక్టార్లలో ఉద్యానవన పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. బారువ వద్ద తీరప్రాంత కోత వల్ల కొన్ని ఎకరాల కొబ్బరితోట కొట్టుకుపోయింది. సోంపేట-బారువ రహదారి ఇరువైపులా 7 కిలోమీటర్ల మేర పంట పొలాల్లో పదడుగుల ఎత్తున నీరు నిలిచింది.

స్థానిక ఎన్నికలపై జగన్ అలర్ట్!

మొదటి పేజీ తరువాయి



రాబోయే పోలింగ్, లెక్కింపు సమయంలో కూడా రిగ్గింగ్ చేయడం, బ్యాలెట్ బాక్సులను మార్చడం వంటి చర్యలకు అధికార పక్షం దిగవచ్చని, అందుకే పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతి తప్పును వీడియోల రూపంలో రికార్డు చేయాలని, సీసీ కెమెరాలు లేని చోట ప్రైవేటుగానైనా కెమెరాలు ఏర్పాటు చేసి సాక్ష్యాలు సేకరించాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక ఓరియెంటేషన్ ఇచ్చి సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని తెలిపారు.

జిల్లా అధ్యక్షులు రోజూ రెండుసార్లు అసెంబ్లీ కోఆర్డినేటర్లతో రివ్యూ నిర్వహించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే లీగల్ సెల్ ద్వారా వెంటనే న్యాయపోరాటం చేయాలని ఆదేశించారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగే పరిస్థితి లేదని, ఒక రాక్షసుడితో యుద్ధం చేస్తున్నామనే భావనతో పనిచేయాలని పేర్కొన్నారు. నామినేషన్ల సమయంలో జరిగిన అక్రమాలపై ఆధారాలు సేకరించి కోర్టు మెట్లక్కుతామని, తప్పు చేసిన అధికారులు, నాయకులు భవిష్యత్తులో వడ్డీతో సహా చెల్లించుకుంటారని, తప్పకుండా శిక్ష అనుభవిస్తారని హెచ్చరించారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అండ!

న్యూస్ డెస్క్, 30 అక్టోబర్ (ఇది కద నిజం):



ఢిల్లీ వేదికగా నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేశారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధన కోసం భారతీయులమంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఊహించినదాని కంటే వేగంగా వృద్ధి సాధిస్తోందని, మధ్య ఆసియా సంక్షోభం వంటి సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ సంప్రదాయ అంచనాలను అధిగమించి ఎగుమతులు పెంచుకున్నామని ఆయన వెల్లడించారు. ప్రపంచంలోని తొలి ఐదు ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒక వెలుగు వెలుగుతోందని కొనియాడారు.

చరిత్ర నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు.. పారిశ్రామిక స్థిరత్వం : ఈ సందర్భంగా చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ.. ఏడు వందల సంవత్సరాల క్రితమే కాకతీయ గణపతి చక్రవర్తి నౌకా వాణిజ్యంపై మోటుపల్లి శాసనం వేయించారని పీయూష్ గోయల్ గుర్తుచేశారు. నాడే వ్యాపారులు తమ పెట్టుబడులకు భద్రతను, విధాన నిర్ణయాల్లో స్థిరత్వాన్ని కోరుకున్నారని, నేడు ఆధునిక పారిశ్రామికవేత్తలు కూడా అవే ఆశిస్తున్నారని తెలిపారు. వికసిత్ భారత్ సాకారం కావాలంటే అన్ని రాష్ట్రాలు, అన్ని రంగాల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

తెలంగాణ వృద్ధి ప్రణాళికలపై ప్రశంసలు : 2047 నాటికి తెలంగాణను బలమైన ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి పెట్టుకున్న లక్ష్యాలను పీయూష్ గోయల్ స్వాగతించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ సంపూర్ణ భాగస్వామిగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జీసీసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ అగ్రగామిగా దూసుకుపోతోందని ప్రశంసించారు. రాష్ట్రంలోని ఫార్మా, బయోటెక్ రంగాలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాయని పేర్కొంటూ.. భవిష్యత్తులో ఏరోస్పేస్, డిఫెన్స్, క్వాంటం కంప్యూటింగ్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు : తెలంగాణలో లభించే జీఐ ట్యాగ్ కలిగిన తాండూరు కందులు, నిజామాబాద పసుపు వంటి అత్యుత్తమ ఉత్పత్తులను ఇప్పటికే ఆస్ట్రేలియా వంటి దేశాలకు ఎగుమతి చేశామని తెలిపారు. సులభతర వాణిజ్య అవకాశాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టే ప్రతి పెట్టుబడి, సృష్టించే ప్రతి ఉద్యోగం తెలంగాణ స్థానిక అభివృద్ధితో పాటు దేశ లక్ష్యమైన 'వికసిత్ భారత్'కు బలమైన పునాది వేస్తాయని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

దేశ పురోగతి కొందరికి ఇష్టం లేదు!

మొదటి పేజీ తరువాయి

గుజరాత్‌లోని బనస్కాంతలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు.

ఇరాన్‌లో కొనసాగుతున్న యుద్ధం, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎరువులు, వంటగ్యాస్ కొరత ఏర్పడుతుందంటూ కొందరు పుకార్లు వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రజలంతా అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తుంటే, కొన్ని రాజకీయ పార్టీలు మాత్రం దేశం ఇబ్బందుల్లో పడాలని కోరుకుంటున్నాయని మోడీ వ్యాఖ్యానించారు. దేశం కష్టాలను ఎదుర్కొంటున్న సమయంలో ప్రజల్లో ఆందోళన కలిగించే ప్రచారం చేయడం సరైన విధానం కాదని అన్నారు.

గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలను ప్రస్తావిస్తూ.. ఎరువులు, వంటగ్యాస్ కొరతపై ప్రతిపక్షాలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని ప్రధాని ఆరోపించారు. దేశమంతా అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో కొందరు ఎరువులు, గ్యాస్ కొరత ఉందంటూ పుకార్లు వ్యాప్తి చేస్తున్నారని, మోడీ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయడమే వారి ఉద్దేశమని విమర్శించారు. దేశంలోని యువత, మహిళలు, బాలికలు అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనలో భాగస్వాములవుతున్నారని మోడీ పేర్కొన్నారు. అయితే దేశం పురోగతి సాధించడం కొందరికి ఇష్టం లేదని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో రైతుల సమస్యలపైనా ప్రధాని మోడీ మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ, ఆ భారం భారత రైతులపై పడకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్లలో ఎరువుల ధరలు పెరిగిన ప్రభావాన్ని రైతులు భరించాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం ప్రయత్నించిందని చెప్పారు. కష్టకాలంలో రైతులకు అండగా ఉంటానని గతంలో ఇచ్చిన హామీని గుర్తుచేశారు.

వ్యవసాయ రంగంలో సైన్స్, టెక్నాలజీ వినియోగాన్ని పెంచేందుకు గత 12 ఏళ్లుగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మోడీ వివరించారు. వ్యవసాయంతో పాటు పశు పోషణ, పాల ఉత్పత్తి రంగాల్లోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. సాయిల్ హెల్త్ కార్డు పథకాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. గతంలో రైతులు తమ పొలాలకు ఏ రకమైన ఎరువులు, ఎంత పరిమాణంలో అవసరమో తెలుసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారని చెప్పారు. సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా భూసారాన్ని తెలుసుకుని, అవసరమైన ఎరువులను ఉపయోగించుకునే అవకాశం కలిగిందన్నారు.

గూఢచర్యం గుట్టురట్టు.. ఇద్దరు పట్టుబాటు!

న్యూస్ డెస్క్, 30 అక్టోబర్ (ఇది కద నిజం):





పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లకు సహకరిస్తూ దేశ భద్రతకు ముప్పు వాటిల్లేలా వ్యవహరిస్తున్న ఇద్దరు భారతీయ యువకులను ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు అరెస్ట్ చేశారు. బీహార్‌కు చెందిన రాజ్ కుమార్ (24), ఆదిత్య పాండే (23)లుగా గుర్తించిన ఈ నిందితులను ఇండో-నేపాల్ సరిహద్దుల్లోని రక్సౌల్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. 'ఆపరేషన్ ఫైర్‌వాల్-2026' పేరిట నిర్వహించిన రహస్య ఆపరేషన్‌లో భాగంగా ఈ అరెస్టులు చోటుచేసుకున్నాయి.

సిమ్ కార్డులు, వాట్సాప్ ఓటీపీల ద్వారా నెట్‌వర్క్

అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నిందితులు భారతీయ సిమ్ కార్డుల ఓటీపీలను సరిహద్దు ఆవల ఉన్న పాకిస్తాన్ ఏజెంట్లకు చేరవేశారు. ఆ ఓటీపీల ఆధారంగా పాక్ ఏజెంట్లు భారతీయ నంబర్లతో కూడిన వాట్సాప్ ఖాతాలను యాక్టివేట్ చేసుకున్నారు. సాధారణ భారతీయ నంబర్లుగా కనిపించే ఈ ఖాతాల ద్వారా భారత సైనిక సిబ్బంది, ఇతర ఉద్యోగులను సంప్రదిస్తూ నిఘా వర్గాలు అనుమానించకుండా సమాచారం రాబట్టే పన్నాగం పన్నారు. ఈ సహకారానికి ప్రతిఫలంగా నేపాల్ సరిహద్దు మార్గాల ద్వారా పాక్ ఏజెంట్ల నుంచి నిందితులిద్దరూ భారీ మొత్తంలో హవాలా రూపంలో నగదు అందుకున్నట్లు దర్యాప్తులో తేలింది.

వైజాగ్ నేవల్ బేస్ సమాచారం లీక్?

ఈ వాట్సాప్ ఖాతాలను ఉపయోగించి విశాఖపట్నంలోని ఈస్టర్న్ నావల్ కమాండ్‌కు సంబంధించిన కీలక వివరాలను పాక్ ఏజెంట్లు సేకరించినట్లు అధికారులు గుర్తించారు. భారత రక్షణ రంగంలో అత్యంత వ్యూహాత్మకమైన యుద్ధనౌకలు, జలాంతర్గాములు (సబ్‌మెరైన్లు), వాటి కదలికలకు సంబంధించిన అత్యంత రహస్య వివరాలను నిఘా వర్గాల కన్నుగప్పి సేకరించినట్లు సమాచారం.

ఇప్పటికే ఇద్దరి అరెస్ట్

ఇదే గూఢచర్యం నెట్‌వర్క్‌పై దృష్టి సారించిన ఏపీసీఐ, గతంలోనే వైజాగ్ నావికాదళ కార్యాలయంలో సివిలియన్ కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న అన్నం సాయి వరప్రసాద్‌తో పాటు మరో ఉద్యోగిని అరెస్ట్ చేసింది. వీరిని విచారించగా వెలుగుచూసిన సాంకేతిక ఆధారాలతో రాజ్ కుమార్, ఆదిత్య పాండేల పాత్ర నిర్ధారణ అయింది. పక్కా సమాచారంతో బిహార్ చేరుకున్న ప్రత్యేక బృందాలు నిందితులను పట్టుకుని విజయవాడకు తరలించాయి. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న మరికొందరి కోసం అధికారులు గాలింపు ముమ్మరం చేశారు.

మాచవరంలో మళ్లీ గ్యాస్ లీకేజ్!

న్యూస్ డెస్క్, 30 అక్టోబర్ (ఇది కద నిజం):



అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరంలో గ్యాస్ పైప్‌లైన్ లీకేజ్ మరోసారి కలకలం రేపింది. ఈనెల 26వ తేదీన పంట పొలాల్లో లీకైన పైప్‌లైన్ నుంచి మరోసారి గ్యాస్ లీక్ కావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పైప్‌లైన్ నుంచి గ్యాస్ ఎగసిపడటంతో చుట్టుపక్కల ప్రాంతమంతా గ్యాస్ వాసన వ్యాపించింది. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందారు.

సమాచారం అందుకున్న ఓఎన్జీసీ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. లీకేజీని అదుపులోకి తీసుకొచ్చి పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదం లేదని అధికారులు చెప్పారు. గతంలో లీకైన పైప్‌లైన్ నుంచే మరోసారి గ్యాస్ లీక్ కావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి లీకేజీని నియంత్రించినప్పటికీ తిరిగి అదే సమస్య తలెత్తడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తరచూ గ్యాస్ లీకేజీలు చోటుచేసుకోకుండా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ఫుడ్ కంపెనీలపై మెరుపు దాడులు!

మొదటి పేజీ తరువాయి

మసాలాలు, వంట నూనెలు, పాల ఉత్పత్తులు, స్వీట్లు, శీతల పానీయాలు, బేకరీ వస్తువులు తయారు చేసే ఈ యూనిట్లలో సోదాలు చేయగా తీవ్ర అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి.

అధికారుల తనిఖీల్లో రద్దీ తయారీ కేంద్రాల్లో తుప్పు పట్టి, మురికిగా ఉన్న యంత్రాలు, పాత్రలను ఉపయోగిస్తున్నట్లు స్పష్టమైంది. అంతేకాకుండా కాలం చెల్లిన సరైన లేబులింగ్ లేని సరుకులు నిల్వ ఉంచడం, బొద్దింకలు, ఈగలు, దోమలతో పాటు ఎలుకల మల విసర్జితాలు, పురుగులు, కీటకాలు సంచరిస్తున్న ప్రాంతాల్లోనే పదార్థాలను తయారు చేయడంపై అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగునీరు నిలిచిపోయిన నేలలు, బూజు పట్టిన గోడలు, సరైన వెలుతురు-గాలి లేని గదుల మధ్య ఈ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వీటితో పాటు ఉద్యోగుల ఆరోగ్య రికార్డులు, పెస్ట్ కంట్రోల్ నివేదికలు, నీటి నాణ్యత పరీక్ష పత్రాలు లేకపోవడాన్ని, అలాగే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించకుండా హెయిర్ నెట్స్, ఆప్రాన్లు, గ్లౌజులు ధరించకపోవడాన్ని తనిఖీ బృందాలు తీవ్రంగా పరిగణించాయి.

ఈ తీవ్రమైన లోపాల నేపథ్యంలో ఆహార భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన 9 ప్రముఖ సంస్థల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను అధికారులు తక్షణమే సస్పెండ్ చేసి, వ్యాపారాలు, ఉత్పత్తిని వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. లైసెన్సులు రద్దయిన / సస్పెండ్ అయిన వాటిలో వరంగల్‌కు చెందిన హరిప్రియ ప్రొడక్ట్స్, దయానంద్ ఐస్‌క్రీమ్స్, రాజు ఘీ స్వీట్ హౌస్, శ్రీకృష్ణ ఆయిల్ మిల్స్, మట్టెవాడ రమేష్ ఇండస్ట్రీస్, జియాన్ ఫుడ్ ప్రొడక్ట్స్ (వెల్ మార్క్), గొగ్రెకుంట కృపా బేకరీ ప్రొడక్ట్స్, హనుమకొండ కపిల్ ఫుడ్స్, షాద్‌నగర్ (చాతన్‌పల్లి) లోని శ్రీ ఎస్ఎంపీ డెయిరీ ఉన్నాయి. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సుమారు రూ.5,89,550 విలువైన 5,555 కిలోల ఆహార పదార్థాలను అధికారులు సీజ్ చేసి ధ్వంసం చేశారు. కల్తీ అనుమానంతో 21 నమూనాలను సేకరించి ల్యాబ్ పరీక్షల కోసం పంపించారు. జరిమానాలు విధించేందుకు గాను గంగా ఫుడ్ టెక్, జీపీఆర్ ఫుడ్స్, హెల్తీ హార్ట్ ఫుడ్స్, వర్షా స్వైసెస్, కరణి స్వైసెస్, మిఠాయివాలా, బెల్ బ్రాండ్, స్వాగత్ స్వీట్స్, మార్టూస్ ఫుడ్ ఁ బెవరేజెస్ సహా మరో 9 సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తీవ్ర లోపాలు ఉన్న లక్ష్మి ఫుడ్స్ (తిమ్మాపూర్), శివ తార ఫ్లోర్ మిల్ (వరంగల్) లకు లోపాలు సరిదిద్దుకోవాలని 'ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు' ఇచ్చారు. వీటిపై తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

భూకబ్జాల గుట్టు.. సీఎం రట్టు!

మొదటి పేజీ తరువాయి

ప్రతిపక్షంలో ఉన్నప్పుడే పోరాటం..

గత ప్రభుత్వం అక్రమార్కులకు అనుకూలంగా తీర్పులు వచ్చేలా వ్యవహరించిందని, కోర్టుల్లో ఎప్పుడూ ప్రభుత్వానికి అనుకూలంగా బలమైన వాదనలు వినిపించలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఈ భూమిపై పోరాటం చేశామని, అధికారంలోకి వచ్చాక సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించి విజయం సాధించామని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆ భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు సీఎం తెలిపారు. అవసరమైతే ఆ భూములను విక్రయించి, వచ్చిన నిధులను పేదల ప్రయోజనాలకు, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి వెచ్చిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా మంచిరేవుల పరిధిలోని 143 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు కేటీఆర్ ప్రయత్నించారని, దానిపై కోర్టుల్లో పోరాడి భూములను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇందులో 50 ఎకరాలను 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'కు కేటాయించినట్లుగా సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇక కబ్జాకోరల్లో చిక్కుకున్న ఐఎంజీ భూముల అంశంలోనూ కోర్టులో బలమైన వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు.

ఎర్రవల్లి సర్వేను అడ్డుకునే యత్నం..

శేరి వెంకటాపూర్ - ఎర్రవల్లి గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు సర్వే చేయడానికి వెళ్తే, ఆ ప్రక్రియను కూడా అడ్డుకునేందుకు ప్రయత్నించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం ఎర్రవల్లిలో సర్వే కొనసాగుతోందని, రకరకాల రూపాల్లో ఆ 388 ఎకరాలను స్వాధీనం చేసుకుంటున్నామని పేర్కొన్నారు. కల్వకుంట్ల ముఠా బారి నుంచి ఇప్పటివరకు సుమారు రూ.లక్షా 50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడామని సీఎం తెలిపారు. కేసీఆర్ ఇకనైనా తన అనుచరులకు భూకబ్జాలు మానుకోవాలని చెప్పాలని హితవు పలికారు. రాష్ట్రంలో జరిగిన ఒక్కో భూకబ్జాపై విచారణ జరుగుతోందని, ప్రజలంతా ఇవన్నీ గమనిస్తున్నారని ఆయన అన్నారు.

కాంగ్రెస్ ర్యాలీ వాయిదా వేయండి!

న్యూస్ డెస్క్, 30 అక్టోబర్ (ఇది కద నిజం):



నవంబర్ ఒకటో తేదీన ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ ర్యాలీ నిర్వహించనున్నది. ఆ ర్యాలీలో సుమారు 10 లక్షల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. అయితే ఆ ర్యాలీని వాయిదా వేయాలని ఢిల్లీ వ్యాపారులు శుక్రవారం కాంగ్రెస్ నేత సోనియా గాంధీని వేడుకున్నారు. దీపావళి సీజన్ షాపింగ్ జరుగుతోంది కాబట్టి , ర్యాలీ వల్ల సుమారు 12వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడే అవకాశం ఉందని, అందుకే ఆ ప్రతిపాదిత ర్యాలీని వాయిదా వేసుకోవాలని సోనియాను ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ కోరింది.

ఢిల్లీలో ఆందోళనలు చేయడం వల్ల సుమారు 20 కీలక మార్కెట్లకు నష్టం జరిగే ఛాన్సు ఉన్నట్లు వాణిజ్య సంఘాలు తెలిపాయి. నవంబర్ 11 తర్వాత ర్యాలీ నిర్వహించుకోవాలని, లేదంటే బురారీ గ్రౌండ్‌కు మార్చుకోవాలని వ్యాపారులు కోరారు. రామ్‌లీలా మైదానంలో ర్యాలీ వల్ల పార్కింగ్ సమస్యలు వస్తాయని, దీంతో సుమారు 20 లక్షల మంది వ్యాపారులపై వత్తిడి ఉంటుందని సీటీఐ తన అభ్యర్థనలో పేర్కొన్నది.

రామ్‌లీలా మైదానంలో 20 వేల వాహనాలను పార్క్ చేసేంత సామర్థ్యం లేదని, కనీసం 200 పెద్ద బస్సులను ఆక్కడ ఆపలేమని వ్యాపారులు తెలిపారు. మైదానానికి 5 కిలోమీటర్ల విస్తీర్ణంలో సుమారు 20 అతిపెద్ద మార్కెట్లు ఉన్నాయని, పండుగ సీజన్ వేళ ఆ మార్కెట్లలో జరిగే సుమారు 12వేల కోట్ల వ్యాపారం దెబ్బతినే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు చెప్పారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 31-10-2026

కూటమి అభ్యర్థుల గెలుపుతోనే

రాజంపేట సమగ్రాభివృద్ధి..!!

- టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు..



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 30:

కడప జిల్లా.. రాజంపేట మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరుకోవడంతో కూటమి అభ్యర్థుల తరఫున ప్రచార పర్వం ఊపందుకుంది. కూటమి పొత్తు ధర్మంలో భాగంగా భారతీయ జనతా పార్టీకి కేటాయించిన 18వ వార్డు అభ్యర్థి సమ్మిటి నరేంద్ర రాజుకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్య అతిథిగా హాజరై వార్డులో ముమ్మర ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు, శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేసి, బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం, ప్రణాళికా లోపం వల్లే రాజంపేట పట్టణం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థలను కూడా సరిగ్గా నిర్వహించలేక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, గత ప్రజా ప్రతినిధులు అసెంబ్లీలో సైతం సమస్యలపై నోరు విప్పలేదని ధ్వజమెత్తారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కేవలం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, వైఎస్సార్సీపీకి పోటీ చేసేందుకు సరైన అభ్యర్థులే కరువయ్యారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే ప్రజల ఆశీస్సులతో మున్సిపల్ చైర్మన్ పదవిని కూటమి కైవసం చేసుకుందని, ఇప్పుడు వార్డు కౌన్సిలర్లను కూడా గెలిపిస్తే కేంద్రం, రాష్ట్రం, చైర్మన్, కౌన్సిలర్ల సమన్వయంతో 'నాలుగు ఇంజన్ల సర్కార్' తరహాలో రాజంపేటను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని ఆయన భరోసా ఇచ్చారు. పట్టణ సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్న కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్ మరియు కూటమి శ్రేణులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

అనంతపురం లో కూటమి పార్టీల బైక్ ర్యాలీ

ఇది కద నిజం న్యూస్,
అనంతపురం.



అనంతపురం మున్సిపల్ ఎన్నికల ప్రచార చివరి రోజున నగరంలో కూటమి పార్టీల శ్రేణులు భారీ బైక్ ర్యాలీతో కదం తొక్కాయి. ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా కూటమి అభ్యర్థుల విజయానికి మద్దతుగా నగరంలోని చారిత్రాత్మక టవర్ క్లాక్ సర్కిల్ నుండి గాంధీ బజార్ వరకు ఈ భారీ బైక్ ర్యాలీ అత్యంత వైభవంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు నాయకుల నినాదాలతో అనంతపురం వీధులు మార్మోగాయి.ఈ సుడిగాలి ప్రచార బైక్ ర్యాలీలో కేంద్ర మంత్రి తోఖన్ సాహు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రముఖ సినీ నటుడు బాబు మోహన్ కూటమి పార్టీల జిల్లా అధ్యక్షులు మరియు ఇతర ముఖ్య నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరందరితో కలిసి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కమ్మూరు నాగరాజు ఈ ర్యాలీలో చురుగ్గా పాల్గొని కూటమి శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా కమ్మూరు నాగరాజు మాట్లాడుతూ అనంతపురం నగర సమగ్ర అభివృద్ధి కూటమి పార్టీలతోనే సాధ్యమని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నగర రూపురేఖలు మారుస్తామని నేతలు హామీ ఇచ్చారు. ర్యాలీ పొడవునా ప్రజలు వ్యాపారులు కూటమి నాయకులకు ఘనస్వాగతం పలికారు.

ఒకటిన జరగబోవు పురపాలిక ఎన్నికలో...

ఓటర్లను భయపెట్టడమే కూటమి పధక రచన..!!

- వైయస్ఆర్సీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి..
- పోలీసుల తీరుపై మండిపడ్డ పొన్నపురెడ్డి కుటుంబం..



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 30:

కడప జిల్లా.. జమ్మలమడుగు పట్టణంలోని స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో చివరి రోజు శుక్రవారం ముగింపు సందర్భంగా పట్టణంలోని బీసీ కాలనీలో వైయస్ఆర్సిపి చైర్మన్ అభ్యర్థి నరహరి హైమావతి ఎన్నికల ప్రచారం ముగించుకొని తిరిగి వస్తున్న సమయంలో కూటమికి చెందిన కొందరు వ్యక్తులు హైమావతి ప్రయాణిస్తున్న కారుపై పెద్ద, పెద్ద బండరాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో హైమావతి ప్రయాణం చేస్తున్న కారు అద్దాలు పూర్తిగా ధ్వంశమయ్యాయి. దాడి విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, సతీమణి ఇందిరమ్మ, కుమారుడు శివారెడ్డి, గిరిధర్ రెడ్డి పట్టణంలోని వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలతో, కలిసి నల్ల కండువాలు ధరించి ర్యాలీగా గాంధీ బొమ్మ సర్కిల్ వద్దకు చేరుకొని చైర్మన్ అభ్యర్థి హైమావతి తో కలిసి రోడ్డుపై బైఠాయించి కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యకలాపాలపై నిరసన వ్యక్తం చేశారు. పురపాలిక ఎన్నికలలో భాగంగా ప్రచార కార్యక్రమం చివరి రోజు కావడంతో ఇలాంటి అల్లర్లు జరగడం చాలా దారుణ మంటూ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కూటమి ప్రభుత్వ నాయకుల పైన మండిపడ్డారు. ఒకటవ తారీఖున జరగబోవు పురపాలిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అల్లర్లు చేసి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయాలన్న ఒక పథక రచనలో భాగమే ఈ అల్లర్లని రామసుబ్బారెడ్డి తెలిపారు. కూటమి నాయకులే వాహనాలను ధ్వంసం చేశారన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని చైర్ పర్సన్ అభ్యర్థి హైమావతి, ఇందిరమ్మ, డిమాండ్ చేశారు. ఈ ఆందోళన మధ్య ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిని పట్టణ పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్సీ అరెస్ట్‌తో వైఎస్సార్సీపీ కార్యకర్తలు, నాయకులు, పోలీసులు తీరుపై మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో ఒక్కసారిగా జమ్మలమడుగు లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గాంధీ విగ్రహం వద్ద ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, పోలీసుల తీరుపై మండిపడ్డారు. దాడి చేసిన వారిని వదిలేసి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిని అరెస్ట్ చేయడం ఏమిటి అని పోలీసులను చైర్ పర్సన్ అభ్యర్థి హైమావతి ఘాటుగా ప్రశ్నించారు. జమ్మలమడుగులో కూటమి నాయకులకు పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, పోలీసులపై తీరుపై ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సతీమణి ఇందిరమ్మ మండిపడ్డారు.

నేతాజీ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన బేరి రామచందర్ యాదవ్



శేరిలింగంపల్లి, అక్టోబర్ 30 (ఇది కద నిజం) న్యూస్:

నేతాజీ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించిన కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్. నేతాజీ నగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుండి మురుగునీరు ఇండ్లలోకి వస్తుందని కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని జలమండలి అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయం సూపర్వైజర్ సురేష్ కి సమాచారం ఇవ్వగా ఆయన సిబ్బందిని పంపించి కాలనీలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యని దగ్గరుండి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్, అసోసియేషన్ సభ్యులు కాలనీ సభ్యులు శంకర్ నాయక్, దశరథ్ నాయక్, గణేష్ నాయక్, రాంబాబు నాయక్. సమస్యను జలమండలి సిబ్బంది అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురుగునీటి సమస్యను పరిష్కరించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జఫర్గఢ్ మోడల్ స్కూల్ విద్యార్థినులు ఎంపిక

ఇది కద నిజం న్యూస్
జఫర్గఢ్ అక్టోబర్ 30



జనగామ జిల్లా కేంద్రంలోని ప్రిస్టైన్ కాలేజ్ గ్రౌండ్‌లో ఈ నెల 8వ తేదీన నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్‌లో జఫర్గఢ్ మోడల్ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.జఫర్గఢ్ మోడల్ స్కూల్‌లో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న రిషిత, నికిత ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు అర్హత సాధించారు.వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.విద్యార్థినుల ఎంపిక పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఈటీలు బి. రాజు, ఏ. శ్రీనాథ్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

సురక్షిత బచ్‌పన్ అభియాన్ లో భాగంగా విద్యార్థులకు పోక్సో చట్టంపై న్యాయ అవగాహన

ఇది కద నిజం న్యూస్ ఐనవోలు /అక్టోబర్ 30



ఐనవోలు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ హనుమకొండ ఆధ్వర్యంలో పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం పై అవగాహన కల్పించేందుకు చేపట్టిన సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ అఖిల భారత పాఠశాల అవగాహన ప్రచారంలో భాగంగా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామంలోని ప్రధానమంత్రి శ్రీ పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.వి.హైమ పూజిత మాట్లాడుతూ పోక్సో చట్టం ప్రాధాన్యతను వివరించారు. బాలల హక్కులు,వారి భద్రత,వ్యక్తిగత రక్షణ, మంచి స్పర్శ చెడు స్పర్శ మధ్య తేడా, అనుమానాస్పద పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

బాలలపై నేరాలు జరిగినప్పుడు దాచిపెట్టకుండా చట్టపరమైన సహాయం పొందేందుకు ముందుకు రావాలని,నివారణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదానందం,సహాయ ఉప తనిఖీదారు గణపతి, సర్పంచ్ స్రవంతి,పాఠశాల సిబ్బంది పాల్గొని పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలు,ఫిర్యాదు విధానం,పిల్లల సహాయ కేంద్ర సేవల గురించి వివరించారు.

బాలల హక్కుల పరిరక్షణ, లైంగిక నేరాల నివారణపై అవగాహన పెంపొందించడం,సురక్షిత వాతావరణం కల్పించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయి.. ఆందోళన వద్దు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, ఇది కద నిజం: తెలంగాణలో బియ్యం ధరల దోపిడీపై సర్కారు ఉక్కుపాదం మోపుతోంది. ఎక్కడైనా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సన్న బియ్యం కిలో 66 రూపాయలు మించకుండా నియంత్రణ చర్యలు తీసుంటామని భరోసా ఇచ్చింది. ఐదు శాఖల సమన్వయంతో ముమ్మర దాడులు చేసి.. ఇప్పటికే 12 కేసులు నమోదు చేసింది. సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందొద్దు అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, బ్లాక్‌మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయించి ప్రజలపై భారం మోపినా కఠిన చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ హెచ్చరించారు. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకొని అడ్డగోలుగా లాభాలు సంపాదించాలనుకునే వారిని ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. పెరుగుతున్న బియ్యం ధరలను అదుపులోకి తీసుకొచ్చి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు.

నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర సభ్యుడుగా

బొల్లంపల్లి విజయ్ భాస్కర్ రెడ్డి నియామకం

శేరిలింగంపల్లి, అక్టోబర్ 30 (ఇది కద నిజం) న్యూస్:



నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ న్యూఢిల్లీ సంస్థ తెలంగాణ రాష్ట్ర సభ్యుడుగా బొల్లంపల్లి విజయ్ భాస్కర్ రెడ్డి నియమితులయ్యారు 2026 అక్టోబర్ 30 నుండి 2029 అక్టోబర్ 29 వరకు మూడేళ్ల పాటు ఆయన ఈ బాధ్యతలో కొనసాగనున్నారు ఈ మేరకు కౌన్సిల్ నుండి అధికారిక నియామక ఉత్తర్వులు జారీ అయినట్లు ఆయన వెల్లడించారు ఫైల్ నెంబర్ 1596851/11001/ నేచర్ వెల్ఫేర్ 2026 ప్రకారం ఈ నియామకం జరిగినట్లు తెలిపారు ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర సభ్యుడిగా బాధ్యతలు అప్పగించిన నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ సెంట్రల్ చైర్మన్ రాహుల్ ద్వివేది కాంపిటేంట్ అథారిటీ సెంటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు తనకు అప్పగించిన బాధ్యతలను అత్యంత నిజాయితీతో ముఖ్యంగా ప్రకృతి సంరక్షణ పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించడం పర్యావరణ పై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యతరిస్తూ పని చేస్తానని తెలిపారు తెలంగాణ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానాని వెల్లడించారు తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు భవిష్యత్తులోనూ ప్రజల ఆశీస్సులు ప్రోత్సహం అందించాలని కోరారు. మూడేళ్ల పాటు లభించిన ఈ బాధ్యతలను ప్రజాసేవకు ప్రకృతి పరిరక్షణకు ఒక మంచి అవకాశం గా భావిస్తున్నట్లు బొల్లంపల్లి విజయ్ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 31-10-2026

సినిమా న్యూస్



అజిత్ 'గ్లాడియేటర్స్' వాయిదా!



తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ రీల్ లైఫ్‌లోనే కాదు, రియల్ లైఫ్‌లోనూ స్పీడ్‌కి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. వెండితెరపై మాస్ హీరోగా అలరిస్తూనే, మరోవైపు ప్రొఫెషనల్ రేసర్‌గా అంతర్జాతీయ ట్రాక్‌లపై రచ్చ చేస్తున్నారు. ఇప్పుడు ఆయన రేసింగ్ లైఫ్‌లోని అసలు సిసలు ఎమోషన్స్, రేసింగ్ ప్రయాణం, ఎదుర్కొన్న కష్టనష్టాలను వెండితెరపై ఎమోషనల్ అండ్ మాస్ లెవెల్‌లో చూపించేందుకు 'గ్లాడియేటర్స్' డాక్యుమెంటరీ రెడీ అవుతోంది. ఏఎల్ విజయ్ డైరెక్ట్ చేస్తున్న ప్రాజెక్ట్‌ను అజిత్ భార్య షాలిని స్వయంగా 'గోల్డెన్ ట్రోఫీ ఫిల్మ్ ప్రొడక్షన్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. నిజానికి ఈ మూవీని నవంబర్ 19నే థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ భావించారు. కానీ కొన్ని కారణాలతో వాయిదా పడి, ఇప్పుడు వచ్చే ఏడాది పొంగల్ పండగ కానుకగా జనవరిలో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నట్లు సమాచారం.

ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక రీసెంట్‌గా ఈ సినిమా నుంచి 25 నిమిషాల ఫుటేజ్ చూసిన యంగ్ డైరెక్టర్ ఆధిక్ రవిచంద్రన్.. ఆసక్తికర విషయాలను పంచుకుని అంచనాలను పెంచారు. జి.వి. ప్రకాష్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు థియేటర్లలో రచ్చ లేపడం ఖాయమని, ఇందులో అనిరుధ్ పాడిన ఒక సాంగ్ స్పెషల్ ఎట్రాక్షన్ అని చెప్పారు. అంతేకాకుండా ఇంటర్వెల్ బ్లాక్, టైటిల్ కార్డ్ పడే ప్లేస్‌మెంట్ ఊహించని రేంజ్‌లో ఉన్నాయని తెలిపారు. అజిత్ ఫ్యామిలీ, పిల్లలతో ఉన్న డ్రామా, ఎమోషన్స్ బాగా వర్కవుట్ అయ్యాయని పేర్కొన్నారు. అలాగే ఈ చిత్రంలో 'సీఎం విజయ్' అతిథి పాత్రలో కనిపిస్తారనే టాక్‌పై స్పందిస్తూ.. తాను సీన్లు పూర్తిగా చూడలేదని,థియేటర్స్‌లో చూడటానికి చాలా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నానని క్లారిటీ ఇచ్చారు.

పాక్‌లోనూ 'రామాయణ' జోరు!

రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా తెరకెక్కిన భారీ చిత్రం 'రామాయణ' క్రేజ్ ఇప్పుడు సరిహద్దులు దాటిపోయింది. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కించిన ఈ విజువల్ వండర్ నవంబరు 5న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుండగా, అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఇప్పటికే రికార్డులు బద్దలు కొడుతోంది. అయితే భారత్‌లోనే కాకుండా.. దాయాది దేశం పాకిస్థాన్‌లోనూ ఈ సినిమా ఫీవర్ మామూలుగా లేదు. కరాచీ నగరంలోని ఓ ప్రముఖ ఆలయంలో అక్కడి స్థానిక హిందువులు 'రామాయణ' సినిమా పోస్టర్‌కు ప్రత్యేక పూజలు చేస్తూ హారతులు ఇస్తున్న దృశ్యాలను సుమిత్ చంద్ర అనే లోకల్ యూట్యూబర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఆ వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతుంది.



"పాకిస్థాన్‌లో ఉంటున్న మాకు 'రామాయణ' అనేది కేవలం రెండు గంటల సినిమా మాత్రమే కాదు. ఇది మా పూర్వీకుల నుంచి వస్తున్న ఆత్మగౌరవం, తరతరాల సంస్కృతి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రికార్డులు సృష్టించాలి" అంటూ అక్కడి ప్రజలు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతల వల్ల పాక్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తారా లేదా అన్నది ఇంకా తేలనప్పటికీ.. కరాచీ గుడిలో పోస్టర్ పెట్టి సంబరాలు చేసుకునే స్థాయికి క్రేజ్ చేరడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.

ధనుష్ 'ఓం' స్టోరీ ఇదే!

ధనుష్ హీరోగా దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఓం' ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా ఎర్రచందనం అక్రమ రవాణా, ఆ అండర్‌వరల్డ్ ప్రపంచాన్ని చూపించే కథేనా అనే సందేహాలు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తున్నాయి. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో డైరెక్టర్ రాజ్‌కుమార్ పెరియసామి ఈ అంశంపై పూర్తి స్పష్టతనిచ్చారు.

ఇది ఎర్రచందనం స్మగ్లింగ్ చుట్టూ తిరిగే రొటీన్ క్రైమ్ స్టోరీ కాదని, అత్యంత లోతైన ఎమోషన్లతో సాగే సినిమా అని ఆయన తేల్చి చెప్పారు. కథ నేపథ్యాన్ని వివరిస్తూ.. "ఒక చెట్టుకు ఎన్నో కొమ్మలు విస్తరించి ఉన్నట్లే.. వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఎందరో మనుషులు ఏదో ఒక బలమైన అంశంతో ఎలా ముడిపడి ఉన్నారన్నదే ఈ కథ" అని పేర్కొన్నారు. ఆయా పాత్రల జీవితాలు, వారి మధ్య ఉండే సంబంధాలు, బలమైన భావోద్వేగాల ప్రయాణమే ఈ చిత్రం అని ఆయన వెల్లడించారు. దర్శకుడి మాటలను బట్టి చూస్తే.. ఎర్రచందనం లాంటి అంశం కథాగమనానికి ఓ నేపథ్యం మాత్రమేనని, అసలైన కథ మాత్రం మనుషుల ఎమోషన్ల చుట్టూనే బలంగా తిరుగుతుందని స్పష్టమవుతోంది. ఈ చిత్రం నవంబర్ 20న రిలీజ్ అవుతుంది.

శ్రద్ధా కపూర్ 'ఈథా' ట్రైలర్!



బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన 'ఛావా' చిత్రానికి దర్శకత్వం వహించిన టాలెంటెడ్ డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఈథా'. ప్రముఖ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. మహారాష్ట్ర సాంస్కృతిక జానపద కళాకారిణి, లావణీ లెజెండ్ విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ బయోపిక్ రూపొందుతోంది.

ఈ చిత్రంలో శ్రద్ధా కపూర్ విఠాబాయి పాత్రలో పరకాయ ప్రవేశం చేసి కనిపించనున్నారు. ఆమె కెరీర్‌లో ఇదొక మైలురాయిగా నిలిచే పాత్ర అని ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. మహారాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే లావణీ నృత్య రూపం మరియు ఒక సాధారణ మహిళా కళాకారిణి అసాధారణ విజయాలు సాధించే ప్రయాణాన్ని ట్రైలర్‌లో అత్యద్భుతంగా హైలైట్ చేశారు. ప్రముఖ నిర్మాత దినేష్ విజాన్ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టాలెంటెడ్ యాక్టర్ రణ్‌దీప్ హూడా కూడా ఒక కీలకమైన పాత్రలో నటిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచేశారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

'ఆవారా' రీ-రిలీజ్

టాలీవుడ్ మరియు కోలీవుడ్‌లో ఎప్పటికీ మర్చిపోలేని కల్ట్ క్లాసిక్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఆవారా'. హీరో కార్తీ, తమన్నా జంటగా, లింగుస్వామి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో పాటు తెలుగు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా యువన్ శంకర్ రాజా అందించిన మ్యూజిక్ ఈ సినిమాకి ప్రాణం పోసింది. అయితే అప్పట్లో ట్రెండ్ సెట్ చేసిన ఈ బ్లాక్ బస్టర్ మూవీ ఇప్పుడు సరికొత్త హంగులతో మరోసారి థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. 'ఆవారా 4ఖ' వెర్షన్‌లో డిసెంబర్ 3న గ్రాండ్‌గా రీ-రిలీజ్ కాబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

కేదార్ ఫిల్మ్స్ రిలీజ్ చేస్తున్న ఈ సినిమాని బిగ్ స్క్రీన్‌పై మరోసారి చూసేందుకు కార్తీ అభిమానులు మరియు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. థియేటర్లలో మరోసారి యువన్ మ్యూజిక్ మానియా, కార్తీ-తమన్నా కెమిస్ట్రీని ఎంజాయ్ చేయడానికి రంగం సిద్ధమైంది!



'జుమాంజి'తో అడ్వెంచర్ రైడ్!

ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్న అడ్వెంచర్ ఫ్రాంచైజీ 'జుమాంజి' నుంచి మరో రోమాంచితమైన చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సిరీస్ నుంచి 'జుమాంజి: ఓపెన్ వరల్డ్' చిత్రానికి సంబంధించిన నూతన తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

విజువల్ వండర్‌గా, పూర్తిగా యాక్షన్ మరియు అడ్వెంచర్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆటలోకి వెళ్లిన తర్వాత జరిగే ఊహకందని పరిణామాలు, ప్రమాదకరమైన సాహసాలు ఈ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నాయి. ఈసారి మరింత భారీ హంగులతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఈ క్రిస్మస్ కానుకగా కేవలం థియేటర్లలో మాత్రమే గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. బిగ్ స్క్రీన్‌పై ఈ సరికొత్త అడ్వెంచర్‌ను అనుభవించడానికి ప్రేక్షకులు, ముఖ్యంగా పిల్లలు మరియు యూత్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

